పత్రికా ప్రకటన కాకినాడ, 21.09.2020

# కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

- ఎస్సీ, ఎస్టీలపై వేధింపులు, అత్యాచార కేసుల్లో

బాధితులకు మహిళా పోలీసులు అండగా నిలవాలి

- తక్షణం పరిహారం అందేలా చూడాలి

- రైస్‌కార్డులు, ఇళ్లస్థలాలను అడిగిన వెంటనే అందించాలి

- డీవీఎంసీ సమావేశంలో కలెక్టర్ మురళీధర్‌రెడ్డి సూచనలు

ఎస్సీ, ఎస్టీలపై వేధింపులు, అత్యాచార ఘటనలకు సంబంధించిన కేసుల సత్వర పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డి.మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా కేసుల విచారణను వేగవంతం చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సమావేశం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్.. కమిటీ సభ్యులు, అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలపై వేధింపులు, అత్యాచారాలకు సంబంధించిన కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత ఉండేదని, ఇప్పుడు గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. ఎస్సీ, ఎస్టీలపై వేధింపులు, అత్యాచారాలకు సంబంధించి సమాచార సేకరణ, విచారణ ప్రక్రియలో సహాయం తదితరాల్లో బాధితులకు అండగా ఉండే విషయంలో మహిళా పోలీసులను భాగస్వామ్యులను చేయాలని ఉన్నతాధికారులకు సూచించారు. ఎఫ్ఐఆర్ నమోదు, మెడికల్ సర్టిఫికెట్లు, సచివాలయం నుంచి కుల ధ్రువీకరణపత్రాలు పొందడం వంటి విషయాల్లో వలంటీర్లు, మహిళా పోలీసులు బాధితులకు అండగా ఉండాలన్నారు. బాధితులకు సత్వరం పరిహారం అందేలా చూడాలన్నారు. రైస్ కార్డులు, ఇళ్ల స్థలాల మంజూరు వంటి సేవలు సచివాలయాల నుంచి బాధితులు వీలైనంత త్వరగా పొందేలా చూడాలని పేర్కొన్నారు. ఈ విషయానికి సంబంధించి సచివాలయ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలిచ్చి, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం కోవిడ్ కారణంగా కేసుల విచారణ ప్రక్రియ నెమ్మదిగా ఉన్నప్పటికీ, దశల వారీగా పెండింగ్ కేసుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు.

## ప్రగతిపై సమీక్ష:

ఎస్సీ, ఎస్టీలపై వేధింపులు, అత్యాచారాలకు సంబంధించి 2017 నుంచి 2020, ఆగస్టు 31 వరకు నమోదైన కేసుల వివరాలతో పాటు బాధితులకు అందిన పరిహారం, కేసుల పరిష్కారం, పెండింగ్ కేసులు తదితరాలకు సంబంధించి సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు జె.రంగలక్ష్మీదేవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గత సమావేశంలో గుర్తించిన సమస్యలు ఏ మేరకు పరిష్కారమయ్యాయనే దానిపై కలెక్టర్ ఆయా విభాగాల అధికారుల నుంచి సమగ్రంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిఠాపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉత్తీర్ణత పెంపునకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచించారు. తుని, జగ్గంపేట, కాకినాడలోని మూడు వసతి గృహాలకు అవసరమైన వాటిని సమకూర్చాలన్నారు. అమలాపురం ఎంపీ చింతా అనురాధ, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పలు అంశాలను కమిటీ దృష్టికి తీసుకొచ్చారు.

## పరిహారం:

ఎస్సీ/ఎస్టీ పీవోఏ చట్టం కేసుల్లో బాధితులకు 2017 నుంచి 2020 వరకు 517 కేసుల్లో రూ.3,96,45,002 మేర పరిహారం అందింది. పరిహారం చెల్లింపునకు సంబంధించి ఇంకా 146 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ (సంక్షేమం) జి.రాజకుమారితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)